క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభించిన కలెక్టర్



చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ అందిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: చిందాడగరువు ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ వెంకటేశ్వరరావు దంపతులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం ప్రారంభించారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీదారులకు కలెక్టర్ స్వయంగా మజ్జిగ అందించారు. ఏటా వేసవిలో చలివేంద్రాన్ని ఏర్పాటుచేస్తున్న వెంకటేశ్వరరావు దంపతులను కలెక్టర్ హిమాన్షుశుక్లా అభినందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ర, డీఆర్‌ఓ సత్తిబాబు, జిల్లా పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రుద్రరాజు సూరపరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐ.పోలవరం: మండలంలో ఉన్న మురమళ్ల, ఐ.పోలవరం సబ్‌స్టేషన్లలో వార్షిక మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల నిమిత్తం వాటి పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఈఈ మోకా రవికుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు

ఐ.పోలవరం: మండలంలోని జి.మూలపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గమ్మ అమ్మవారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు తదితరులున్నారు.

హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పోషకాహార కిట్లు

అమలాపురం టౌన్: హెచ్ఐవీ బాధిత చిన్నారులకు జన కల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్ల పంపిణీ కార్యక్రమం స్థానిక వంటెద్దువారి వీధిలో సోమవారం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడుల చేతుల మీదుగా బాధిత చిన్నారులకు కిట్లు అందజేశారు. దాతలు వెంకన్నాయుడు, కె.రిష్విక్, సీహెచ్ ప్రసన్న, జి.చంద్రశేఖర్, జల్లి సుజాత, కురుస సంతోష్‌ల ఆర్థిక సహకారంతో కిట్లను సమకూర్చారు. కార్యక్రమంలో జనకల్యాణ్ సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఇజ్రాయిల్ పరామర్శ



సత్యనారాయణమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఇజ్రాయిల్

అల్లవరం: ఇటీవల మృతి చెందిన మాజీ జెడ్పీటీసీ, విశ్రాంత ఉపాధ్యాయుడు గుబ్బల సత్యనారాయణ సతీమణి మాజీ ఎంపీపీ మాతాకస్తూరి, వారి కుమారులను ఎమ్మెల్సీ అభ్యర్థి బొమ్మి ఇజ్రాయిల్ సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తొలుత సత్యనారాయణమూర్తి చిత్రపటం వద్ద ఇజ్రాయిల్ నివాళులర్పించారు.

అధికారులతో మండల స్థాయి స్పందన

ఉప్పలగుప్తం: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందనకు అర్జీలు తక్కువగా వచ్చాయని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. ప్రధానంగా భూ సమస్యలపై ఎక్కువ అర్జీలు వచ్చాయన్నారు. తన పొలాన్ని సాగు చేసుకునేందుకు పక్క రైతుకు చెందిన పంట బోదె నుంచి నీరందించాలని భీమనపల్లికి చెందిన ఓ అర్జీదారుడు కోరాడన్నారు. వెంటనే స్పందించి ఆ ప్రాంతానికి వెళ్లి సమస్యను ఏవో జి.కుమార్‌బాబుతో కలిసి పరిష్కరించానన్నారు. ఎండ తీవ్రత పెరగనున్న నేపథ్యంలో ప్రతి సెంటర్లలో, ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ వెంకటేశ్వరి కోరారు.

సత్యనారాయణమూర్తికి ఘన నివాళి

అల్లవరం: అల్లవరం మండల మాజీ జెడ్పీటీసీ సభ్యులు గుబ్బల సత్యనారాయణమూర్తి మృతికి ఎస్టీయూ కార్యవర్గం ఘనంగా నివాళులర్పించింది. అల్లవరంలో సోమవారం జరిగిన సంతాప సభలో పలువురు ఎస్టీయూ ప్రతినిధులు మాట్లాడుతూ సత్యనారాయణమూర్తి క్రమశిక్షణ కలిగిన నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో మోసుగంటి వెంకటేశ్వరరావు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.శివప్రసాద్ పాల్గొన్నారు..

శివారు తాగునీటికి భరోసా

- రూ.20 కోట్ల ప్రాజెక్ట్‌తో మార్గం సుగమం
- మూడు ఓహెచ్ఆర్ ట్యాంకుల నిర్మాణం
- రోజుకు 88.50 లక్షల లీటర్లకు చేరుకోనున్న సరఫరా



గాంధీనగర్‌లో శరవేగంగా నిర్మిస్తున్న ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణం

అమలాపురం టౌన్: పట్టణంలోని శివారు ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు మున్సిపాలిటీ ఉన్నతాధికారులు ప్రణాళికలు రచించారు. దీనికోసం రూ.20 కోట్ల ఖర్చుతో ప్రత్యేక ప్రాజెక్ట్‌ను చేపట్టారు. దీంట్లో భాగంగా పట్టణంలోని మూడు ప్రాంతాల్లో ఓహెచ్ ఆర్ ట్యాంకుల్ని నిర్మించనున్నారు. అంతేకాదు అయా ట్యాంకుల నుంచి శివారు ప్రాంతాల్లోని ప్రజల ఇళ్లకు నీరందించేలా పైపులైన్లు ఏర్పాటుచేయనున్నారు.

శివారు క'న్నీటి' కష్టాలు

అమలాపురం పట్టణంలో ప్రస్తుత సుమారు 53,000 మంది నివసిస్తున్నారు. ఏటికేడు పట్టణ జనాభా పెరుగుతోంది. అమలాపురం జిల్లా కేంద్రంగా మారడంతో రోజువారీ పనుల నిమిత్తం ఇక్కడకు వచ్చేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం పట్టణ జనాభాకు రోజుకి ఒక్కొక్కరికి 85 లీటర్ల చొప్పున మొత్తంగా 51 లక్షల లీటర్లు సరఫరా చేస్తున్నారు. అయితే శివారు ప్రాంతాల్లో మాత్రం ఒక్కొక్కరికి 30 లీటర్లకు మించి అందడం లేదు. శివారు ప్రాంతాలైన రావులచెరువు, బండివారిపేట, మెట్ల కాలనీ, నల్లా గార్డెన్స్, హౌసింగ్ బోర్డు కాలనీ, మద్దాలవారిపేట, బ్యాంక్ కాలనీ, బుచ్చెమ్మ అగ్రహారం, ఏవీఆర్ నగర్, కార్మిక నగర్, గాంధీ నగర్ తదితర 12 ప్రాంతాల్లో తాగునీటికి ఇక్కట్లు తప్పడం లేదు. మున్సిపాలిటీ నిత్యం మూడు ట్యాంకర్లతో 15 ట్రిప్పులు వేసి ఆయా ప్రాంతాల్లో నీరందిస్తోంది. అయినా నీటి సరఫరా ఏమాత్రం సరిపోవడం లేదని అక్కడి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ప్రధానంగా వేసవి కాలం వచ్చిందంటే చాలు వారి క'న్నీటి' కష్టాలు అన్నీ ఇన్నీ కాదు.

మంత్రి విశ్వరూప్ చొరవతో

వాస్తవానికి పట్టణ జనాభాకు ఒక్కొక్కరికి 85 లీటర్లకు బదులు 135 లీటర్లు సరఫరా చేసినప్పుడే సంతృప్తికర సరఫరా అవుతుందని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ఈ లెక్కన పట్టణ ప్రజలకు రోజూ 88 లక్షల లీటర్లకు పైగా తాగునీరు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఆ స్థాయిలో సరఫరా సౌకర్యం సాకారం చేసేందుకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సీఎం స్పెషల్ గ్రాంట్ నుంచి గతేడాది రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో ప్రత్యేకించి శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం అందించేలా గాంధీనగర్, ఏవీఆర్ నగర్, హౌసింగ్‌బోర్డు కాలనీల్లో మూడు ఓహెచ్ఆర్‌ల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఇప్పటికే గాంధీనగర్‌లో ఓహెచ్ఆర్ ట్యాంకు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మిగిలిన రెండు ప్రాంతాల్లోను నిర్మాణాలకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మూడు ఓహెచ్ఆర్‌ల నిర్మాణానికే రూ.7 కోట్లు ఖర్చవుతుంది. మిగిలిన నిధుల్ని ప్రధాన ప్రాజెక్టు–ఫిల్టర్ బెడ్ల నిర్మాణం, కొత్తగా ఇంటింటికీ పైపులైన్లు ఏర్పాటు చేసి ఓహెచ్ఆర్‌ల నుంచి కనెక్షన్‌లు ఇవ్వడం తదితర పనులకు ఖర్చుచేయనున్నారు.

పెరగనున్న సరఫరా సామర్థ్యం

కొత్తగా నిర్మిస్తున్న ఒక్కో ఓహెచ్ఆర్ ట్యాంకు 625 కిలో లీటర్ల (6.25 లక్షల లీటర్లు) సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. రోజుకు ఉదయం, సాయంత్రం రెండు దఫాలుగా ఒక్కో ఓహెచ్ఆర్ నుంచి 12.50 లక్షల లీటర్ల నీరు సరఫరా కానుంది. అంటే రోజుకు ఈ మూడు ఓహెచ్ఆర్‌ల ద్వారా రెండు పూటలా కలిపి మొత్తంగా 37.50 లక్షల లీటర్ల నీరు అదనంగా సరఫకా కానుంది. ప్రస్తుతం సరఫరా అవుతున్న 51 లక్షల లీటర్ల నీటికి తోడు కొత్తగా వచ్చే మూడు ఓహెచ్ఆర్‌ల ద్వారా సమకూరే 37.50 లక్షల లీటర్ల నీటితో కలుపుకుని పట్టణానికి సరఫరా స్థాయి మొత్తం 88.50 లక్షల లీటర్లకు చేరుకోనుంది. ఈ ప్రాజెక్ట్ పనులను రాజమహేంద్రవరం రీజియన్ ప్రజారోగ్య శాఖ పర్యవేక్షిస్తోంది.

> **రానున్న 30 ఏళ్లకు తాగునీటి భరోసా**
>
> ప్రాజెక్ట్ నిర్మాణం ఏడాదిలోగా పూర్తయ్యే అవకాశముంది. అది పూర్తయితే పట్టణ ప్రజలకు రానున్న 30 ఏళ్ల వరకూ తాగునీటికి పూర్తి భరోసా లభిస్తుంది. ప్రధానంగా శివారు ప్రాంతాలకు నీటి ఇక్కట్లు తీరిపోతాయి.
>
> – కొత్త అప్పలరాజు, డీఈఈ, అమలాపురం మున్సిపాలిటీ

యానాం అభివృద్ధికి పెద్దపీట

రూ.11,600 కోట్లతో బడ్జెట్ సమర్పించిన సీఎం రంగసామి



అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న సీఎం రంగసామి

యానాం: పుదుచ్చేరి 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.11,600 కోట్ల బడ్జెట్‌ను సీఎం రంగసామి అసెంబ్లీలో సోమవారం ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో యానాం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశారు. ఆరోగ్య శాఖకు రాష్ట్రవ్యాప్తంగా రూ.1042.64 కోట్లు కేటాయించగా దాంట్లో యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యమిచ్చారు. ప్రధానంగా మోడరన్ లేబొరేటరీ, ఎయిడ్స్ కంట్రోల్, ఫైలేరియా, మలేరియా, పెథాలజీ, మైక్రో బయాలజీ, బ్లడ్ బ్యాంక్ యూనిట్‌లు నెలకొల్పనున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే ల్యాడ్ నిధులు ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.2 కోట్లను దశలవారీగా ఇవ్వనున్నట్లు చెప్పారు. కనకాలపేట డంపింగ్ యార్డును అక్కడ నుంచి తరలించడానికి తక్షణ చర్యలు, వ్యర్థాల ద్వారా సేంద్రియ ఎరువు తయారీకి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కనకాలపేట హైస్కూల్‌లో ఆధునిక సౌకర్యాలు, ఎస్సీల్లోని అర్హుల కోసం ఇంటి స్థల సేకరణ చేపట్టామన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ నుంచి యానాంలో వికలాంగులకు వసతి గృహాల ఏర్పాటు, తాత్కాలిక వసతి, జువైనల్ జస్టిస్ బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కనకాలపేట ఇండోర్ స్టేడియాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. పుదుచ్చేరి వ్యాప్తంగా యువతకు సంక్షేమ పథకాల కోసం రూ.504 కోట్లు, మహిళా సాధికారితకు రూ.1,332 కోట్లు, గ్రీన్‌బడ్జెట్‌గా రూ.555 కోట్లు, వ్యవసాయానికి రూ.159.36 కోట్లు, సివిల్ సప్లయిస్‌కు రూ.246.82 కోట్లు కేటాయించారు. అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొన్నారు.

కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఆర్‌ఏఓ మునిస్వామి



యూడీసీ కోచింగ్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: యూడీసీ ఉద్యోగాల రాతపరీక్షకు ఇస్తున్న కోచింగ్‌ను ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌ఏఓ మునిస్వామి అన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ విజ్ఞాన భవన్‌లో కోచింగ్ క్లాసులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఎక్కువగా వచ్చాయన్నారు. అభ్యర్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధన చేయాలని కోరారు. సమయాన్ని ఇతర వ్యాపకాలకు వినియోగించొద్దని హితవు పలికారు. రాతపరీక్షలో ముఖ్యమైన సిలబస్‌లో పేర్కొన్న మేథ్స్, సైన్స్, హిస్టరీ, రాజ్యాంగం తదితర అంశాలపై ఎక్కువగా దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు రేఖాడి కృష్ణమూర్తి, నల్లా సూర్యప్రకాష్, నాయకులు పండు సిద్దార్థకుమార్, పెండెం సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



రోడ్డు పనులకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

కాట్రేనికోన: పెనుమల్లే నుంచి సన్నవిల్లికి వెళ్లే రహదారికి రూ.1.66 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు పనులకు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సోమవారం శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా పెనుమల్లే, లక్ష్మివాడ గ్రామాలకు వచ్చినపుడు బీటీ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చానన్నారు. నియోజకవర్గంలో పెనుమల్లే–లక్ష్మివాడ, అయినాపురం–బాడవ, బొడ్డువానిలంకలో బీటీ రహదారులకు ఒక్కోదానికి రూ.1.66 కోట్ల చొప్పున ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేశారన్నారు. నెల రోజుల్లో పెనుమల్లే–లక్ష్మివాడ రహదారి పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వంకా ఏడు కొండలు, చొల్లంగి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ నేల కిషోర్, సానబోయిన నాగేశ్వరరావు, నడింపల్లి సూరిబాబు, ఏడిది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు



మానేపల్లిలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

పి.గన్నవరం: మానేపల్లిలో సర్పంచ్ పితాని చంద్రకళ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ గ్లూకోమ వారోత్సవాలు నిర్వహించారు. నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుబ్బరాజు, పి.గన్నవరం సీహెచ్‌సీ ఆప్తాల్మిక్ అధికారి వి.వీరభద్రరావులు 50 మందికి కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్ కంటి వెలుగు స్క్రీనింగ్ కార్యక్రమం జరిగింది. వైద్యులు మాట్లాడుతూ 40 ఏళ్లు పైబడిన వారు ఏటా గ్లూకోమా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ టీవీవీఎస్ఎన్ మూర్తి, ఆరోగ్య కార్యకర్త పీసీహెచ్ లక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు పితాని నర్సింహారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన ఎన్.రామేశ్వరం స్వాంప్



స్వాంప్‌ని ఇసుకతో కప్పేసిన దృశ్యం

అల్లవరం: కొమరగిరిపట్నం శివారు ఎన్.రామేశ్వరంలోని బ్రిడ్జి పక్కన మురుగునీరు నిల్వ ఉండే టైడల్ ఏరియాను స్థానికంగా కొందరు ఆక్రమించుకుని సముద్ర ఇసుకతో నింపేశారు. వారం రోజుల క్రితం కొందరు యువకులు రాత్రికి రాత్రే ట్రాక్టర్ల సాయంతో ఇసుక తరలించి దాదాపుగా బ్రిడ్జికి సమాంతరంగా కప్పేశారు. అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల పరిధిలోని 22 వేల ఎకరాల ముంపునీరు ఈ స్వాంప్ ద్వారా సముద్రంలో కలుస్తుంది. ఇప్పటికే స్వాంప్ మెరక్కైన కారణంగా ఏటా ముంపునీరు స్తంభించి వందలాది ఎకరాలు ముంపుబారిన పడుతున్నాయి. ఇప్పుడు స్వాంప్‌ని పూర్తిగా కప్పేయడంతో ముంపు సమస్య మరింత తీవ్రమవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. స్వాంప్ ఆక్రమణకు గురై వారం రోజులు కావస్తున్నా నేటికీ అధికారులు స్పందించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

యథేచ్ఛగా మట్టి రవాణా



ఎస్.యానం నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలు

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం, చల్లపల్లి, సరిపల్లి గ్రామాల్లో మట్టి, బొండు ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఎస్.యానం గ్రామంలో తీర ప్రాంతం నుంచి నిత్యం పగలు, రాత్రి అన్న తేడా లేకుండా లారీలతో, ట్రాక్టర్లతో మట్టి తరలిస్తున్నారు. చల్లపల్లి గ్రామం నుంచి మట్టిని తరలించి సరిపల్లి రహదారుల పక్కన గుట్టలుగా వేసి రాత్రి వేళల్లో లారీలతో అమలాపురం, ముమ్మిడివరం తదితర ప్రాంతాలకు తరలిస్తున్నట్లుగా స్థానికులు చెబుతున్నారు. ఈ మట్టిని రియల్ ఎస్టేట్ వ్యాపారులతో పాటు గ్రామాల్లో గృహనిర్మాణాల పునాదుల్లో వేసుకునేందుకు అమ్ముతున్నట్లుగా తెలుస్తుంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదని ఎస్.యానం, చల్లపల్లి, సరిపల్లి గ్రామాలకు చెందిన నివాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ జె.వెంకటేశ్వరిని వివరణ కోరగా తవ్వకాలకు, రవాణాకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. అనధికారికంగా మట్టి తవ్వకాలు, రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

- బస్సులు, ఇతర వాహనాల స్టాపు పాయింట్లలో మార్పులు
- డ్రైవర్లతో సమావేశంలో వెల్లడించిన పట్టణ సీఐ దుర్గా శేఖరరెడ్డి



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న పట్టణ సీఐ దుర్గా శేఖరరెడ్డి

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం జిల్లా కేంద్రమైన నేపథ్యంలో రోజు రోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ వలయాన్ని ఛేదించేందుకు కొత్త సీఐ ద్వారంపూడి దుర్గా శేఖరరెడ్డి బస్సులు, ఇతర వాహనాల స్టాపు పాయింట్లను మార్పు చేశారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి ఆటో డ్రైవర్లు, ఇతర వాహనాల డ్రైవర్లతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్పు చేసిన స్టాపు పాయింట్లపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు, ఆటోల్లో ప్రయాణికులు ఎక్కి, దిగే ప్రదేశాల్లో మార్పులు అనివార్యం చేశారు. పట్టణంలోని ఎర్ర వంతెన, నల్లవంతెన, ఈదరపల్లి వంతెనల వద్ద రోజూ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం అవుతున్న క్రమంలో నియంత్రణ చర్యలు చేపట్టినట్లు సీఐ దుర్గా శేఖరరెడ్డి తెలిపారు. ఈ మార్పులను పట్టణ ప్రజలు, వాహన చోదకులు గమనించి పట్టణ ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఇవీ మార్పులు

- కాకినాడ నుంచి అమలాపురం వైపు వచ్చే బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు ఎర్ర వంతెన వద్ద ఆపకుండా ఇక నుంచి దానికి దగ్గరలో ఉన్న 'ది అమలాపురం డిగ్రీ కళాశాల' ఎదుట ఆపాలి.
- అమలాపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ముమ్మిడివరం, అయినవిల్లి వైపు వెళ్లే వాహనాలు పాపులర్ షూమార్ట్, కుంకాల సందు వద్ద కాకుండా సమీపంలోని ముమ్మిడివరం గేటు సెంటరు వద్ద ఆపాలి.
- అమలాపురం నుంచి కాకినాడకు వెళ్లే నాన్‌స్టాపు ఎక్స్‌ప్రెస్ బస్సులు ఇక నుంచి ఈదరపల్లి వంతెన, సావరం బైపాస్ రోడ్డు, నల్లవంతెన మీదుగా ఎర్ర వంతెన వద్ద గల నాన్ స్టాపు కౌంటర్‌కు వెళ్లాలి.
- పాపులర్ షూమార్ట్, కుంకాల సందు నుంచి ముమ్మిడివరం గేటు సెంటరు రోడ్డు వన్‌వేగా అమలవుతున్న క్రమంలో 3, 4 వీలర్ వాహనాలు ఎదురుగా వచ్చేందుకు అనుమతించరు.
- హైస్కూలు సెంటర్ నుంచి గొల్లగూడెం బైపాస్ రోడ్డు మీదుగా పుల్లయ్య రామాలయం సెంటర్ రోడ్డు వన్‌వే అమలులో ఉన్న దృష్ట్యా హైస్కూలు సెంటరు నుంచి 2, 3, 4 వీలర్ వాహనాలు గొల్లగూడెం బైపాస్ వైపు ఎదురుగా వచ్చేందుకు అనుమతించరు.

'నాటు నాటు'కు ఆస్కార్‌పై హర్షాతిరేకాలు



అమలాపురంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ఎన్టీఆర్ అభిమానులు

అమలాపురం టౌన్: దర్శకుడు రాజమౌళి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఆర్ఆర్ఆర్ చిత్రంలోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు రావడంపై అమలాపురం పట్టణ ఎన్టీఆర్ అభిమానుల సంఘం హర్షాతిరేకాలు వ్యక్తం చేసింది. స్థానిక శేఖర్ థియేటర్ వద్ద జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు సోమవారం సాయంత్రం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచి బాణసంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్టీఆర్ అభిమానుల సంఘం అధ్యక్షుడు రాయుడు బాబ్జి, జిల్లా ఆర్గనైజర్ కొపనాతి వెంకటరాజు, పట్టణ సంఘం అధ్యక్షుడు మట్టపర్తి రాము, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదర్శంగా నిలిచిన మొల్ల




మాచవరంలో మొల్ల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: సంస్కృతంలో ఉన్న రామాయణాన్ని మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో తెలుగు పదాలతో రచించారని, కాలక్రమేణా ఆ రామాయణం మొల్ల రామాయణంగా పేరుగాంచి ఆదర్శంగా నిలిచిందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కొర్లపాటి కోటబాబు అన్నారు. అంబాజీపేట శివారు కుమ్మరిపాలెంలో సీతారామ శాలివాహన సంఘం ఆధ్వర్యంలో మొల్లమాంబ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆమె రచనలను విదేశీ రచయితలు సైతం ప్రశంసించారు. తొలుత మొల్ల చిత్రపటం వద్ద పలువురు పూలమాల వేసి ఘన నివాళులర్పించి కేకు కట్ చేశారు. కార్యక్రమంలో మానేపల్లి వీరబ్రహ్మం, ఆదుర్తి నారాయణమూర్తి, ఉందుర్తి నాగబాబు, చిరతపూడి హేమలత, ర్యాలి శ్రీనివాస్ వడయార్, ర్యాలి భద్రకిరన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గృహ సారథుల సమావేశంలో ఎమ్మెల్సీ తోట



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కీలకభూమిక పోషించాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. చెల్లూరులో సోమవారం కూర్మాపురం, కురకాళ్లపల్లి, వెంటూరు, చెల్లూరు, పసలపూడి, మాచవరం గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో ఎమ్మెల్సీ తోట సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని, ప్రభుత్వం సంక్షేమానికి చిరునామాగా మారిన విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తూ ప్రజలతో మమేకం కావాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో పాటుగా ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. సమావేశంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథరెడ్డి, పార్టీ ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సిరిపురపు శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ చిన్నం అపర్ణ తదితరులు కూడా ప్రసంగించారు. సచివాలయ మండల కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమావేశంలో పరిచయం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు కొవ్వూరి అమ్మిరెడ్డి, గుబ్బల సుబ్రహ్మణ్యం, కత్తుల సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

నాణ్యత పాటించాలి



పెదపట్నంలో రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: ప్రభుత్వ నిబంధనల ప్రకారం రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పెదపట్నంలో జరుగుతున్న రోడ్డు పనులను ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట పి.గన్నవరం జీసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు తదితరులు ఉన్నారు.

నిత్యాన్నదానానికి రూ.21 వేల విరాళం



అప్పనపల్లిలో స్వామి చిత్రపటాన్ని దాతకు అందిస్తున్న ఆలయ చైర్మన్, ఈఓలు

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామంలో వేంచేసిన బాలబాలజీ స్వామి వారి ఆలయంలో నిర్వహించే అన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన గొడవర్తి శ్రీదేవి జ్ఞాపకార్థంగా వారి కుమారుడు గొవర్తి జగన్నాథ కుమార్, కస్తూరి దంపతులు, వారి కుమారులు కల్యాణ్‌రుత్విక్, హితేష్ సాత్విక్ రూ.21,116 సోమవారం విరాళంగా అందజేశారు. వైశాఖ శుద్ధ పంచమి రోజున అన్నదానం జరిపించుటకు శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళంగా అందించారని ఆలయ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్ చెప్పారు. అనంతరం స్వామి చిత్రపటాన్ని, లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీను, కొమ్ముల సూరిబాబు, ఆలయ ఉప ప్రధాన అర్చకులు మద్దాలి తిరుమల శింగరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

రావులపాలెం: వివిధ కారణాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి తమ సభ్యులు రక్తదానం చేసినట్టు స్వామి వివేకానంద యోగా ఆశ్రమం గురువు శ్రీనివాస్ సోమవారం తెలిపారు. చొప్పెల్ల ఇటుకబట్టీలో జీవనోపాధి పొందుతున్న శ్రీకాకుళానికి చెందిన సరళ మల్లన్న, గేదెల్లంకకు చెందిన మట్ట సునీత, ముక్తేశ్వరానికి చెందిన మానేపల్లి దుర్గ అమలాపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరికి రక్తం అవసరం కావడంతో యోగా ఆశ్రమం సభ్యులు అప్పన సురేష్, కాండ్రేగుల శేఖర్, సలాది బుజ్జి, గుత్తుల సురేష్, నల్ల ప్రవీణ్‌లు యోగా గురువు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. ఇప్పటివరకూ తమ సంస్థ నుంచి 11 వేల మందికి రక్తదానం చేసినట్టు శ్రీనివాస్ తెలిపారు.